





మన దేశంలో ఉన్న ప్రతి నదికీ ఓ ప్రత్యే కత ఉంది. అది పారే విధానం, దిక్కు, సారం, ఆ తీరాన వెలసిన క్షేత్రాలు, నది వెంబడి సాగే జీవనం... వీటన్నిటి ఆధారంగా వాటికి ప్రత్యేకతలను ఆపాదించి కొలుచుకునే ఆచారం మనది. అందుకే మనవారు కేవలం సమీపంలో ఉన్న నదిని మాత్రమే పవిత్రంగానో, పుణ్యక్షేత్రంగానో భావించరు. బ్రహ్మపుత్ర నుంచి పంపా నది వరకు ప్రతి నదినీ దేవతగా గుర్తిస్తారు. ఏదో ఒక సమయంలో వాటిని దర్శించాలని కోరుకుంటారు. అందుకే ఒక నదికి వచ్చే పుష్కరాలు స్థానిక వేడుకగా కాకుండా, దేశమంతా పండుగలా భావించే వేదికగా మారతాయి. ఈ ఏడాది కూడా అలాంటి ఒక సందర్భం వస్తున్నది. నర్మదా నదికి పుష్కర ఘడియలు సమీపించాయి. మే 1 నుంచి 12 వరకు ఈ పుష్కరాలు జరుగుతాయి. ఈ సందర్భంగా పుష్కరాల విశేషాలు, నర్మదా నది వైభవాన్ని తలుచుకునే ప్రయత్నమిది!

**ఇదీ పుష్కరుడి కథ!**

పుష్కరాల సంప్రదాయం వెనుక ఉన్న కథలలో ఎక్కువగా వినిపించే గాథ ఇది. పూర్వం తుందిలుడు అనే రుషి ఉండేవాడు. ఆయన శివుణ్ని ప్రసన్నం చేసుకునేందుకు ఘోరమైన తపస్సు చేశాడు. ఆ తపస్సుకు మెచ్చిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకోమని అడిగితే... 'నీలో నాకు శాశ్వత స్థానం లభించేట్లు అనుగ్రహించమ'ని వేడుకున్నాడు తుందిలుడు. అతని భక్తికి మెచ్చిన శివుడు తనలోని జలశక్తికి ప్రతినిధిగా మారమని తుందిలుణ్ని అనుగ్రహించాడు. అలా ఈ జగాన ఉన్న జలాలకు తుందిలుడు అధిపతి అయ్యాడు. జలం లేకుండా జీవం లేదు కాబట్టి, తుందిలుడికి పుష్కరుడు (పోషించేవాడు) అన్న మారు పేరు స్థిరపడింది. ఇదిలా ఉండగా బ్రహ్మదేవుడు తన సృష్టిని కొనసాగించడానికి జలశక్తి అవసరమైంది. దాంతో పుష్కరుణ్ని తనకు అండగా ఉండమని ఆహ్వానించాడు. శివుడి అనుజ్ఞతో పుష్కరుడు బ్రహ్మ దగ్గరికి వెళ్లి సృష్టికి సాయపడ్డాడు. బ్రహ్మ పని పూర్తయినప్పటికీ, పుష్కరుణ్ని వదులుకోవడం ఆయనకు ఇష్టం లేకపోయింది. అలా పుష్కరుడు బ్రహ్మ దగ్గరే ఉండిపోయాడు.

కొన్నాళ్లకు దేవగురువైన బృహస్పతి, భూమి మీద ఉన్న జీవులందరినీ తన జలశక్తితో పాపవిమోచనం చేయగలిగే పుష్కరుణ్ని తనతో పంపమని బ్రహ్మను అభ్యర్థించాడు. పుష్కరుణ్ని శాశ్వతంగా వదులుకోవడం ఇష్టం లేని బ్రహ్మదేవుడు ఓ మధ్యేమార్గాన్ని సూచించాడు. బృహస్పతి ఒక ఏడాదిలో ఏ రాశిలో అయితే ప్రవేశిస్తాడో, నాటి నుంచి 12 రోజుల పాటు ఒక నదిలో ఉండమని సూచించాడు. అలా 12 రాశులకు, 12 నదులను కేటాయించాడు. గంగానది (మేష రాశి), నర్మద (వృషభం), సరస్వతి (మిథునం), యమున (కర్కాటకం), గోదావరి (సింహం), కృష్ణ (కన్య), కావేరి (తుల), భీమా/తామ్రపర్ణి (వృశ్చికం), తపతి/బ్రహ్మపుత్ర (ధనుస్సు), తుంగభద్ర (మకరం), సింధు (కుంభం), ప్రాణహిత (మీనం).

**ఉత్తరాదికి జీవనది!**

నదుల గురించి చెప్పుకొనేటప్పుడు గంగ, యమున, కృష్ణ, గోదావరి లాంటి పేర్లు వినిపించినంతగా నర్మదను తల్చుకోరు. నిజానికి నర్మద కూడా అంతే అద్భుతమైన జీవనది. భారతదేశంలో ప్రవ

## జన్మవృత్తాంతం!



హిందూ పురాణాలలో నర్మదది ఓ ప్రత్యేక స్థానం. స్కంద, కూర్మ, మత్స్య పురాణాలలో నర్మద వృత్తాంతం కనిపిస్తుంది. శివుడి దేహం నుంచి పుట్టినది కాబట్టి అయోనిజ అనీ, పరమేశ్వరుడికి ప్రీతికరమైనది కాబట్టి నర్మద అనీ, అలలతో ఎగురుతూ ప్రవహించేది కాబట్టి రేవా నది అనీ పిలుస్తారు. ఇవే కాకుండా పూర్వ గంగ, సోమోద్భవ లాంటి చాలా పేర్లే కనిపిస్తాయి నర్మదకు. నాగులకు తమ రాజ్యాన్ని తిరిగి ఇప్పించే క్రమంలో, నర్మదాదేవి పురకుత్సుడనే రాజును ఆకర్షించి నాగలోకానికి రప్పించినట్టు ఒక కథ వినిపిస్తుంది. అమర్ కంటక్ దగ్గర పుట్టిన నర్మద మైదాన ప్రాంతాల గుండా కాకుండా రాళ్లు, కొండలను చీల్చుకుంటూ... అడవుల మధ్య ప్రవహిస్తూ సాగుతుంది. ఈ నది ప్రవహించే దారి పొడవునా ప్రతీ క్షేత్రం ఏదో ఒక పురాణ పాత్రతో ముడిపడి ఉండటం విశేషం. మాంధాత చక్రవర్తి తపస్సు చేసిన మాంధాత ద్వీపం, జాబాలి పేరు మీదుగా జబల్‌పూర్, భృగు మహర్షి తపస్సు ఆచరించిన బ్రోచ్ లాంటి స్థలాలు పురాణకాలంలో ఉన్న అనుభూతినిస్తాయి. ఈ నదిలో శివలింగాన్ని పోలిన బాణలింగాలు కనిపించడం మరో ప్రత్యేకత. ఇన్ని అబ్బురాలు ఉన్నాయి కాబట్టే నర్మద నదిని చూసినంతనే పుణ్యం లభిస్తుందని భావిస్తారు. ఆ నదీతీరాన జరిగే స్నానం, దానం, యాగం విశేష ఫలితాన్నిస్తాయని నమ్ముతారు.